
# ఫీనిక్స్

- కొండేపూడి నిర్మల



"అమ్మో ఇప్పుడొద్దే!'
"ష్ అలా అనకూడదని చెప్పానా!"
"పరీక్షే!"

"పోతే పోనీ వెధవ పరీక్ష కావరానికంటే ఎక్కువా?"

"సివిక్స్ మేడమ్ చంపేస్తుందే."

"ఇప్పుడు లోపలి కెళ్లక పోతే నేను చంపేస్తాను."

"ఈ ఒక్కసారి..... ప్లీజ్..... నా మాట వినవే సివిక్స్...."

"నోర్మయ్యవే కాకిగోల. నిక్క నీలిగి వచ్చాడనలే, పది కబుర్లు వెళ్లాక. హడలి చచ్చాం కదటే మీ నాన్నా నేనూ ఏం మూడిందిరా దేవుడా, దీని కావరానికని.... అనలే ఆ తండ్రి తిరుగుబోతు."

పదహారేళ్ల కూతుర్ని నిర్దయగా గదిలోకి నెట్టింది తల్లి.

ఒలికి పోయిన ఇంకు బాటిల్లా చీకటి

కెవ్వుమన్న పసి కనీళ్లు.

కొండ చిలవ లాంటి అవులింత.

* * *

"అమ్మా. ఇవాళ వెళ్లనే!"

"అదేం?"

"పరీక్షే!"

"అయితే..."

"ఇంగ్లీష్ మేడమ్ చంపేస్తుంది తప్పితే."

"చంపితే చంపింది. నువ్విలా చీటికీ మాటికీ దొంగ వేషాలేస్తే కుదర్దు."

"పొత్తి కడుపులో నొప్పి. నుంచుంటే కళ్లు తిరుగుతున్నాయే"

"అన్నీ నద్దుకుంటాయి కదులు ముందు."

"నా కిప్పుడే పిల్లలొద్దే." చటుక్కున కూలబడి నీరసంగా ఏడవసాగింది.

"శుభం పలకడం రాదేమే నోటికి. పిల్లల మూలంగా చక్కబడ్డ నంసారాలున్నాయి తెలుసా? మా పెత్తల్లి కొడుకు బామ్మర్ది కూడా...."

"హయ్యో డోకొచ్చేస్తోంది ఇవాళంత ఇంటోనే చదువు కుంటానే."

"వెడతా వా, వెళ్లవా ముందు. అతగాడో పక్క ధన ధన ధనా ఎమ్మేలూ పి.ఏలూ పానయి పోతుంటే తగుదునమ్మా అని దొరికావు వరువు తక్కువ వరువు తక్కు వాని... ఊఁ ఇదిగో నిమ్మకాయ చెక్క..." అంటూ తల్లి కూతుర్ని బైటికి తోసింది.

బెదురు గొడ్డులాంటి నడక

ప్రిన్సిపాల్ భూతం దగ్గర చివాట్లూ, చెప్పుదెబ్బలూను.

ఏడు పావుకోలేక కాంటీన్ వెనక గుండా విజయంటికి వరుగుతీస్తే అదీ లేదు. వాళ్లన్నయ్య శేఖరున్నాడు.

"బాధ పడకండి ప్లీజ్..... నే ననలు చూళ్లేను. భుజాల చుట్టూ చేతులేసి అదే పనిగా ఓదార్చాడు ఏ మాట కాటే. ఆ స్పర్శ బావుంది. గుళ్లోకెళ్లిన విజయ ఇప్పుడప్పుడే రాకపోతే బావుండు. అబ్బా! ఈ ఓదార్పుకోసం రోజంతా హాయిగా ఏడవాలని ఉంది. ఏడవూ ఏడుపూ రావేం! ఇదేం చిత్రం! పైగా ఒళ్లంతా ఏదో పులకరింత.

* * * *

"అన్నం పెట్టమ్మా ఆకలి దంచేస్తోంది." చీర మార్చకుండానే మంచం మీద వాలిపోయింది.

"ఎక్కడి నుంచొస్తున్నావు?" గాండ్రు పులిలా అడిగింది తల్లి.

"వి....విజయా వాళ్లింట్లో నోట్సు రానుకుని .వుట్టినరోజంటేనూ .." మాటలు కూడబలుక్కుంటోంది.

"నోర్మయ్." మాటకంటే ముందు చెంప చెళ్లుమంది.

"..............."

"అబద్ధాలు కూడా మొదలెట్టావా? ఎవడు వాడు? నీ పక్కన సినిమా హాల్లో....చెప్పు.... తమ్ముడు చూశాడ్లే నీ భాగోతమంతా......"

"వాడి పక్కనున్న దెవరో అడగవేం మరి !?" రోషంగా తలెగరేసింది కూతురు.

"వాడితో వంతేమిటే నీకు? వాడు మగాడే."

"వాడి పక్కనున్నది మటుకు ని నిఖార్సయిన ఆడదేలే."

"అదిగో... అందుకే.... ఆ తల తిరుగుడు చూసే వదిలేసుంటాడు నీ మొగుడు. అనలే రాత చెడిందానివి. చూసి అడుగెయ్యమని చిలక్కి చెప్పినట్టు చెబుతున్నానా, లేదా! సిగ్గు లేదూ ఓ పిల్ల తల్లివి ఇలాగేనా నడుచుకునేది? నువ్వే ఇలా ఉంటే రే పిదేం బాగుపడుతుంది?" ఇరవై రెండేళ్ల కూతురి మీదికి ఆరేళ్ల మనవరాల్ని తోసి అలిసి పోయినట్టు ఆగింది తల్లి.

కూతురు ఈ లోకంలో లేదు. ఎంత విషమ పరిస్థితుల్లోంచయినా చటుక్కున చేతులు చాచి రక్షించే మరో లోకం ఆమె ఎప్పుడో కనిపెట్టింది.



"ఏమ్మా! ఏడుస్తున్నావ్? దారి తప్పిపో యావా?" దారే పోయేదానయ్య అడిగాడు.
"లేదండీ! మా అమ్మానాన్నే ధారి తప్పారు" వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పింది చిన్నారి.

ఇమ్మిడిశెట్టి చిన్న
మండపేట

"ప్రాంచద్భూషణ బాహుమూల రుచితోఁ బాలిండ్లు పొంగారఁ బై యంచుల్ మోవఁగ గౌగిలించి......"

తెలుగు క్లాసులో జరిగిన అల్లరి నెమరేసుకుంటోంది.

"ఆ తర్వాత...." చెవి పక్కన గునగునగా శేఖర్ గొంతు వినిపించినట్టయి 'ఛీ పాడు' అంది పైకే.

పద్యానికి ప్రతి పదార్థం చెబుతూ 'రుచి' అనే మాటకి పార్వతీ మిస్ మూడు మెలికలు తిరిగేలోపు 'టేస్ట్' అంటూ వెనకబెంచీలోంచి తనూ, శ్యామలా అరవడం, క్లాసంతా ఘొల్లుమనడం గుర్తొచ్చి పక పకా నవ్వింది.

తనలో తను గొణుక్కుంటూ ఏడుస్తున్న తల్లి పరమ ఏద్దూరంగా కూతురి వంక చూసి మళ్ళీ ముక్కు చీదుకుంటూ పెడబొబ్బలు కొనసాగించింది.

"ఏం చెయ్యనే తల్లీ! ఆ మారాజే బతికుండి నేను పోయినా సరిపోయేది. ఈ దారుణాలు చూడ్డం తప్పేది. అయినా నువ్వేం ఆడదానివే? ! నువ్వు నవ్వంగా మెలిగితే వాడెందుకు మొహం తప్పిస్తాడే."

"నేను నిజంగా ఆడదాన్నే అమ్మా! కావాలంటే శేఖరాన్ని అడుగు. నీ అల్లుడే పశువు" అన్లేదు కూతురు. ఓ నవ్వు విసిరి ఊరుకుంది. భగ భగా మండిపోయింది తల్లికి.

"ఎంత కొవ్వెక్కిందే నీకు! ఇంకేం బాగు పడతావు నువ్వు! ఇంత బరి తెగించి పోయాక... ఇంతేలే ఇహ నీ బతుకు కుక్కలు చింపిన విస్తరే...."

"ఔనమ్మా! బరితెగించాను! నీళ్లకీ పాలకీ తెలీని రోజుల్లో పెళ్లి చేసి పారేసి ఆ గదికి ఉరేశావు. వద్దు మొర్రో అంటున్నా వినకుండా బంధాలు బంధాలని పిల్ల తల్లిని చేశావు. వదిలించుకు పారిపోవాలని చూస్తున్న వాడి మీదికి ఉసిగొలిపి నా సిగ్గుకి నీళ్లొదిలావు.

"వాడి కోసం నా చదువుకి గండి కొట్టావు. అక్కడితో వదిలావా - నాగరీకం మరిగిన నీ అల్లుడి మెప్పుకోసం పాలు తాగే పిల్లని ఎండగట్టి నన్ను కాలేజీకి తరిమావు. ఇదంతా నా మంచి కోసమే అని ను వ్వనుకోవచ్చు.

"కానీ, అమ్మా! ఇప్పు డిప్పుడే ఇదా ప్రపంచం అనుకునే వేళకి నా కళ్లు మూస్తున్నావు. నా కాళ్లకి బంధాలు వేస్తున్నావు. నా మనశ్శాంతిని కొరుక్కు తినే శత్రువులా ప్రవర్తిస్తున్నావు. ఇవన్నీ నీవు గీసిన బరులు కాదూ? ఈ బరులు నా బతుక్కేం చేశాయి? వీటిని తెగించకుండా ఎలా ఉండమంటావు?

"ఇప్పుడే చెబుతున్నా విను. నేను మెచ్చి మనసిచ్చిన మగాడే నా మొగుడు. అప్పుడెప్పుడో జరిగింది పెళ్లికాదు. నా తద్దినం అనుకో! మీ పెద్ద వాళ్ల కుళ్ళు ముచ్చట అనుకో! వాళ్ల పొలాలకీ, మీ మేడలకీ కలిసి పోయిన లంకె అనుకో! అంతే గాని....

"అలా చూడకు నా కేం భయం లేదు నువ్వంటే...

"ఆడ దానికి శరీరం ఉంది. అది ప్రేమించబడాలి. మెదడుంది దానికి ప్రేమ నేర్వాలి. నా ఈడు పిల్లలంతా ఎంత హాయిగా ఉన్నారో చూశావా! పాతికేళ్లన్నా రాకుండానే నా కెన్ని చేదు అనుభవాలు. నా కంటే మన పిడకల గూట్లో పిల్లి ముండ అదృష్టవంతురాలు. దానికిన్ని బాధల్లేవు. అడుగడుక్కీ దగాల్లేవు. పారిపోయిన మొగుడి పేరు చెప్పి, కనిపించని కూతుర్ని చూపించి అస్తమానమూ నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యొద్దు. వరువే గనక సమస్య అయితే చెప్పు. ఈ క్షణమే వెళ్లి పోతాను."

పుట్టిన తర్వాత ఇంతవర కెప్పుడూ అంత మాట్లాడ్డం అలవాటు లేక పోవడం వల్ల చిన్న వగర్పుతో క్షణం ఆగి ఫ్రిజ్‌లోంచి సీసా తీసి కడునిండా మంచి నీళ్లు తాగింది. నొప్పి చేసిన కన్నీటి కణాలు గొంతులో కరుగుతున్నాయి. ○


# లక్కీ స్టోన్ [భాగ్యరత్న]
# ధర రూ. 20/- మాత్రమే

## ప్రయోజనం సిద్ధించకపోతే సొమ్ము వాపసు చేయబడును

మనిషి మనుగడపై గ్రహాలు మరియు నక్షత్రాల ప్రభావం ఎంతైనా ఉంటుందని తెలిపిన ప్రముఖ జ్యోతిశ్శాస్త్రవేత్తల అద్భుతమైన జోస్యాలు భవిష్యవాణి ఆధారంగా చెప్పబడినవి. జ్యోతిశ్శాస్త్రంపై అనేక సందేహాలున్నప్పటికీ, పశ్చిమ దేశాలలోని హేతువాదులు మన అదృష్టంపై గ్రహాల ప్రభావాన్ని అంగీకరించారు.

విభిన్నమైన రత్నాలకు వేర్వేరు జన్మరాశులపై ఖచ్చితంగా ప్రభావం ఉంటుంది అని ప్రత్యేక అధ్యయనాలు వెల్లడి చేస్తున్నాయి. రాశులననుసరించి రత్నాలను సక్రమంగా ఎన్నుకుంటే, రత్నాల నుండి వచ్చే ప్రయోజనకరమైన కంపనాలు, ధరించిన వ్యక్తి అదృష్టంపై ప్రయోజనకరంగా ప్రభావం చూపిస్తాయి. పురాతన భవిష్యద్వాణి ఆధారంగా నిరయాన్ పద్ధతి [చాంద్రమానం] ప్రకారం మేము లక్కీ స్టోన్స్ ఇస్తాము. ధర రూ. 20/- మాత్రమే. దీని తీక్షణత మొదట్లో తక్కువ ఉంటుంది మరియు విజయం మిమ్మల్ని వరిస్తుంది. అసాధారణమైన గ్యారంటీ ఇవ్వబడింది. 30 రోజులలోగా మీరు అనుకున్న విధంగా ఈ రత్నం మీ అదృష్టంపై ప్రభావం చూపకపోతే, మీరు బిల్లుతో పాటు దీనిని వి. పి. పి. ద్వారా పొందవచ్చును. మేము తప్పనిసరిగా దానిని తీసుకొని మీకు పూర్తిగా రూ. 20/- లు పంపుతాము. మీరు రూ. 20/- లు ఎం. ఓ. పంపితే, అవి మీ వి.పి.పి. ఛార్జీలు రూ. 12/- లు ఆదాచేస్తుంది.

ఉపయోగించే విధానం: మీరు లక్కీ స్టోను తీసుకున్న తర్వాత సోమ, లేదా గురువారాలలో స్నానం చేసిన పిదప పాలతో మరియు నీళ్ళతో కడగవలెను. ఈ రత్నానికి ఎదురుగా అగర్‌బత్తి వెలిగించి ఆ తర్వాత ధరించవలెను. మీరు సరియైన లక్కీ స్టోను లభ్యమైనది అని నిర్ధారించుకున్న తర్వాత దానిని ఉంగరంలో లేదా లాకెట్‌లో అమర్చి అన్ని సమయాలలో ధరించవలెను. మీరు రోజూ ఈ రత్నాన్ని పూజించనవసరం లేదు. స్త్రీలు తమ బహిష్టు కాలంలో కూడా ధరించవచ్చును. మీరు ఇతర అమూల్యమైన రత్నాలు మరియు ఆభరణాలు వేసుకొని ఉంటే వాటిని తేసివేయనవసరం లేదు. మీకు ప్రయోజనం సిద్ధిస్తే మాకు వ్రాయండి. మీకు మా శుభాభినందనలు.

గమనిక: ఈ రత్నం స్వాభావికమైనది ఇది ఇంద్రజాలం లేదా మంత్రజాలం కాదు.

హెడ్ ఆఫీస్
రామ్‌రత్న ఆస్ట్రాలాజికల్ రిసెర్చి ఇనిస్టిట్యూట్
27, నీల్‌తరంగ్ ఫియట్స్, నిజాంపుర, బరోడ - 390 002.